

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

*– సంపాదకుడు*

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

**మండుటెండలో** తెల్లరంగు బట్టలు వేసుకున్నవారు చాలామంది పరుగెడుతున్నారు. రోడ్‌కి మధ్యలో ఒక్క చెట్టు తప్ప వేరే ఏమీ లేదు. చుట్టుపక్క ఉన్న ఇళ్ళల్లోకి అంతా వెళ్ళారు. నేను కూడా మా ఇంటికి వెళ్ళాను. లోపల నీలి రంగు గోడలు, ఇంట్లో అందరూ కూడా తెల్ల దుస్తుల్లోనే ఉన్నారు. ఇల్లు చేరాక ఆకలి తెలిసింది.

"ఎందుకు వచ్చావు?" నాన్న అడిగారు.

బదులివ్వలేదు.

"నువ్వు బయటకి వెళితే తిరిగిరానవసరం లేదని ముందే చెప్పాముగా. మా మాట పట్టించుకోకుండా నీ దారిన నువ్వు వెళ్ళిపోయావు. మళ్ళీ ఏం మొహం పెట్టుకుని వచ్చావు?" అమ్మ అడిగింది.

మళ్ళీ బదులివ్వకుండా నేలకేసి చూసాను.

"ఇక మీదట గడపదాటను అని ఒట్టు వేస్తేనే లోపలికి రా. లేదా వెనక్కి తిరిగి వెళ్ళిపో" నాన్న అన్నారు.

బయట వేడికి దాహం, ఇంట్లోకి రాగానే ఆకలి, అలసట బాగా తెలిసాయి. హాయిగా పట్టెడన్నం తిని పెరటిలో నిద్రపోవాలని ఉంది. లోపల చారు వండుతున్న వాసన కూడా వస్తుంది. ఇంక మీద బయటకి వెళ్ళను అని చెప్పి కాస్త మజ్జిగ తాగాలని ఎంత అనిపించినా, ఆ మాట నా నోటి నుండి బయటకి రాలేదు.

"అలా రాయిలా నుంచున్నావేంటి? నీతోనే మాట్లాడేది" అమ్మ దబాయించింది.

'ఇంట్లోనే ఉంటా' అని ఎంత చెప్పాలనుకున్నా నోటి వెంట మాట రాలేదు. చివరికి ఏం బదులివ్వకుండానే వెనక్కి తిరిగి వీధిలోకి వచ్చాను. చుట్టుపక్కల ఎంతమంది తలుపు కొట్టినా, "మీ ఇంట్లోకే రానివ్వలేదు, మా ఇంటిలోకి ఎలా రానిస్తాం" అని తలుపులు మూసారు. ఆఖరికి కలిసి పెరిగిన తోబుట్టువులవంటి చుట్టాలు కూడా అంతే చేసారు. చెరువులో నీరు తాగుదామని నడుస్తుండగా పెద్ద శబ్దం. తిరిగి చూస్తే తుపాకీ పట్టుకుని దాడికి వస్తున్నారు. పరుగెత్తుతూ ఒక ఇంటి మెట్ల చాటున దాక్కున్నాను. ఇంతలో ఆ మేడ మీద నుండి ఎవరో కాల్చారు. విచిత్రంగా చీకటి కాక వెలుగు కనబడింది. తలతిప్పి చూస్తే అన్నయ్య గదిలో నిద్రలేచాను. ఇదంతా కల! 'హమ్మయ్య' అనుకుంటుండగా, నిద్రలో ఏడ్చానని అర్థమైంది.

కడుపులో దిగులు అలాగే ఉంది. ఇలా అయితే కష్టమని ఇండియాలో ఉండే ఫ్రెండ్‌కి ఫోన్ చేసాను.

"మీకు ఇంక సరిగ్గా పొద్దు నవ్వలేదు కదా. అప్పుడే చేసావేంటి?" అడిగింది.

"ఏదో పిచ్చి కలొచ్చి మెలుకువ వచ్చేసింది" చెప్పాను.

"ఏమొచ్చింది?"

కలంతా చెప్పాను.

"ఓ డ్రీమ్ సైకాలజీలో అదేంటో చూస్తా" అంది.

"అంటే?"

"ఒక ఆప్. అందులో మనకి వచ్చిన కలని వివరిస్తే ఎందుకు వచ్చింది అనే సైకలాజికల్స్ రీజన్ చెప్తుంది."

"ఓ అయితే చూడు."

"మధ్యాహ్నం పూట ఎండలో చంపబడడం అంటే ఏదైనా ఇష్టం లేకుండా చేయడం, జీవితంలో ఒక భాగం పూర్తై మరోభాగానికి వెళ్ళడం లేదా ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉండడం వల్ల వస్తుందట. ఇంట్లో వారు వెళ్ళ కొట్టడం అంటే ఫియర్ ఆఫ్ లూసింగ్ కనెక్షన్ అట" అంది.

"ఓ అవునా" అన్నాను.

"వీటిల్లో నీకు ఏది వర్తిస్తుంది?"

"బహుశా నేను తిరిగి వెళ్ళిపోబోతున్నావుకదా, అందుకేమో."

"అయినా దానికి, చావుకి సంబంధం లేదు కదా?"

కొన్ని క్షణాలు ఆలోచించి "నిన్ను నేను, అన్నయ్య యుద్ధం గురించి మాట్లాడాను అందుకొచ్చిందేమో."

"అంతే అయ్యుంటుంది."

"నేను అనుకుంటూనే ఉన్నా ఇలాంటిదేదో ఒక పిచ్చి కలవస్తుందని."

"మీ అన్నయ్యకి చెప్పు రాత్రిళ్ళు అలాంటివి మాట్లాడద్దని."

"నేనే అడిగాను. ఇకనించి అలా చెయ్యను లే."

అన్నయ్య లేచిన చప్పుడు రావడంతో ఫోన్ పెట్టి అన్నయ్య దగ్గరికి వెళ్ళాను. విచిత్రంగా ఆ కల ఎందుకు వచ్చి ఉంటుందో కనిపెట్టాక కడుపులో దిగులు తగ్గింది.

"అప్పుడే లేచావే" అన్నయ్య అడిగాడు.

"మెలుకువ వచ్చేసింది. ఇవాళ ఏం చేద్దాం?" అడిగాను.

"షాపింగ్" ఒళ్ళు విరుస్తూ అన్నాడు.

"అయినా మళ్ళీ ఏం షాపింగ్?" అడిగాను.

"బుక్స్ కొనాలి" అన్నాడు.

"అదేంటి? లైబ్రరీలో తీసుకుంటావు కదా?"

"ఆఫీసులో ఇద్దరికి గిఫ్ట్ తీసుకోవాలి. దానికోసం. అయినా పొద్దునే నీ ఇంటరాగేషన్ ఏంటి?" అన్నాడు.

ఇద్దరం తయారయ్యి బార్న్స్ అండ్ నోబుల్‌కి వెళ్ళాము.

"కాఫీ తాగుతావా?" అడిగాడు.

"ఎప్పుడు?"

"ఇప్పుడే. బార్న్స్ అండ్ నోబుల్‌లో స్టార్ బక్స్ ఉంటుంది" అన్నాడు.

"నువ్వు తాగుతావా?"

"యా. ఇంకా నిద్రమత్తు వదలలేదు."

"అయితే నేను నీకు కంపెనీ ఇస్తా" అన్నాను.

లోపలికి వెళ్ళి అన్నయ్య అమెరికానో ఆర్డర్ చేసి నావైపు చూసాడు. అదృష్టవసాత్తు నా వెనక ఎవరూ లేరు. అక్కడ మెన్యూలో ఒక ఫోటో చూపించి "ఇది" అన్నాను.

"పక్కానా?" అడిగాడు.

తలూపాను. అన్నయ్య ఆర్డర్ చేసాడు. మేము మా కాఫీల కోసం వెయిట్ చేస్తున్నప్పుడు "సాధారణంగా ఇంత చలిలో ఎవరూ కోల్డ్‌వి తీసుకోరు" అన్నాడు.

"ఔను. చలిలో కష్టమే" అన్నాను. అప్పుడే నేను చూపించింది చలి పదార్థమని తెలుసుకున్నాను.

"అది హాట్ చాక్లెట్‌లా ఉంది ఫోటోలో" అన్నాను.

"అది ఫ్రాపే. అంటే ఐస్ వేస్తారు" నవ్వాడు.

"కావాలంటే హాట్ చాక్లెట్ తీసుకుని ఇది పడేయ్" అన్నాడు.

"లేదు. ఫరవాలేదు. తాగేస్తా" అన్నాను.

రెండు, మూడు గుక్కలకే ఒళ్ళంతా చలి పెరిగింది. పైగా అది చేతులని పూర్తిగా చల్లగా చేసేసింది.

"కూర్చుని తాగుదామా?" టేబుల్ మీద గ్లాస్ పెట్టచ్చని అడిగాను.

"అక్కరలేదు. తాగుతూ బుక్స్ చూడచ్చు" అంటూ లోపలికి నడిచాడు. బిక్కు బిక్కు మంటూ నేను వెళ్ళాను.

"నీకు ఏమైనా కావాలంటే చూసుకో. క్లియరెన్స్ అక్కడ ఉంది" అని చూపించాడు. నేను అటుగా నడుచుకుంటూ వెళ్ళి పుస్తకాలని చూడసాగాను. గ్లాసుని ఆ టేబుల్ మీద పెట్టి బుక్‌ని రెండు చేతుల్లోకి తీసుకుని చదువుతున్నట్టుగా నటించాను. త్వరగా తాగేస్తే ఈ గోల ఉండదని ప్రయత్నించాను కానీ దగ్గు మొదలైంది. నెమ్మదిగా, ఎవరూ చూడకుండా దాన్ని డస్ట్‌బిన్‌లో పడేసి ఊపిరి పీల్చాను. ఆ తరవాత ఒక షెల్ఫ్‌లో 'కిత్నే గాజా ఆయ్, కిత్నే గాజా గయే' అనే పుస్తకం మీద ఒక టర్బన్ కట్టుకుని ఉన్న ఆయన ఫోటో ఉంది. ఇండియన్ అని తెలియగానే ఎందుకో కాస్త ఆనందంగా అనిపించింది. వెంటనే అది తీసి చూసాను. విచిత్రంగా అది ఒక సోల్జర్ రాసిన ఆటో బయోగ్రఫీ. అక్కడే నేల మీద కూర్చుని చదవసాగాను. నిన్న రాత్రి సుభాష్ చంద్రబోస్ పుస్తకంలా కాక చాలా ఆకర్షణీయంగా రాసారు. మొదటి పది పేజీల్లో మూడు ఫోటోలు కూడా ఉన్నాయి. నేను అది చదువుతుండగా అన్నయ్య వచ్చి "ఏ బుక్ అది?" అడిగాడు.

పుస్తకం అట్ట చూపించాను.

"బావుందా?" అడిగాడు.

"ఇప్పటివరకు బానే ఉంది."

"సరే పద."

పుస్తకం షెల్ఫ్‌లో పెట్టేందుకు లేచాను.

"బుక్ ఎందుకు పెడుతున్నావు?"

"వెళ్ళిపోతున్నాముకదా."

"తీసుకెళదాం. పద"

పుస్తకం వెనక్కి తిప్పి ఖరీదు చూసాను. 30 డాలర్లు.

"చాలా ఎక్కువ దీని ధర అన్నాను."

"ఎంత?" వెనక్కి తిరిగి అడిగాడు.

"ముప్పై."

పెద్దగా నవ్వి "ఆ మాత్రం ఖర్చు చెయ్యలేననుకుంటున్నావా?"

మూడు పుస్తకాలు తీసుకుని ఇంటికి బయలుదేరాం. దారిలో నాకు వచ్చినకల గురించి చెప్పాను. ఆ తరవాత అన్నయ్య సారీ చెప్పడంతో ఆశ్చర్యపోయాను "ఎందుకు?" వెంటనే అడిగాను.

"నేను చిన్నప్పటి విషయాలు చెప్పడం వల్లేకదా ఆ కల వచ్చింది." అన్నాడు.

ఆశ్చర్యపోయి "నీలో  ఈ మార్పు నాకు నచ్చలేదు. ఎప్పటిలానే ఉండు. ఇంత సెంటిమెంటల్ టీవీ సీరియల్‌లా మారకు" అన్నాను.

ఇల్లు చేరాక "చారు వండనా మరి కల్లో కూడా వచ్చిందిగా" అన్నాడు.

"చారు వండరు. చారు పెడతారు" వెక్కిరించాను.

"ప్రకృతి – వికృతి. ఇంతకీ కావాలా వద్దా?" అడిగాడు.

"చెయ్యి" అని నేను కిచెన్‌లోకి వెళ్ళాను.

"చారు మామూలుగా మన ఇంట్లో జ్వరం వస్తే చేసేవారు. నాకు కాస్త జలుబు చేసినా అమ్మ వెంటనే చారు వండేది" అన్నాడు.

"కానీ అమ్మ చారుకన్నా అమ్మమ్మ చారే బావుంటుంది."

"అమ్మ ఇంగువ చాలా తక్కువ వేస్తుంది. మనకి కారంగా ఉంటుందేమో అని చాలా పదార్థాలు వేసీ వేయనట్టు వేస్తుంది."

"నువ్వెప్పుడైనా కాషాయం తాగావా?"

"ఆఁ తాగాను. సినిమాల్లో చూపించినంత విరక్తి కలిగే రుచికాదు. ఘాటు ఎక్కువ."

"నిజంగానే అది తాగితే జలుబు తగ్గుతుందా?"

"మాములుగా ఒక రెండు రోజులైతే కషాయంతో ఒక రోజు."

"కషాయం అంటే చేదు కదా?"

"అమ్మమ్మ చేసేది రుచిగానే ఉండేది. చిన్న బావకి అది చాలా ఇష్టం"

"నువ్వు, చిన్న బావ ఫ్రెండ్స్ కదా?"

"అవును. ఒకే క్లాస్."

"నాకన్నా చిన్న. పెద్ద అయితే బావ. చిన్న కాబట్టి చిన – బావ. చిన్నప్పుడు అంతకన్నా వరసలు తెలిసేవి కావు. పెద్దవాళ్ళు కూడా ముచ్చట పడిపోయి సరి చేయలేదు. నేను అలా పిలుస్తా అని నీకూ అలానే అలవాటైంది.

"ఇప్పటికీ ఫ్రెండ్సా?"

ఆఁ ఇప్పటికీ అప్పుడప్పుడు మాట్లాడతాం."

"నువ్వు ఎవరితో టచ్‌లో ఉండవనుకున్నానే."

"మంచివాళ్ళతో మాత్రమే ఉంటాను. వాళ్ళమీద, వీళ్ళ మీద గాసిప్ చెప్పేవాళ్ళు, లేదా మనమీద పడి ఏడ్చే వాళ్ళతో దూరంగా ఉంటా."

"మరి సందేష్‌తో ఎందుకు మాట్లడవు?"

"ఎవరో పెళ్ళిలో 'వీడికి పెళ్ళి, నాకు ఇల్లు ఈ జన్మలో అయినట్టే' అన్నాడు. నాకు కోపం వచ్చి పలకడం మానేసా. నన్ను అలా అవమానించినందుకు అమ్మ వాడి మొహం చూడనంది. వాడు కూడా సారీ ఎప్పుడు చెప్పలేదు. ఇప్పటికీ నా మీదపడి ఏడవడమే" అన్నాడు.

తెలీకుండానే ఎంతో కోపం కలిగింది.

"చాలామంది అంటారు, 'నీకు పంతం బాగా ఎక్కువ, వదిలేయి' అని. కానీ నా బాధ నాకే తెలుసు. ఎంత బాధపడితే చిన్నప్పటినుండి కలిసి పెరిగిన వారితో మాట్లాడ్డం ఆపేస్తాను, చెప్పు?" బదులివ్వలేదు.

"అలా అని వేరే వారు మాట్లాడితే వద్దని ఎప్పుడూ చెప్పను. నా మంచి కోరని వారిని, నన్ను బాధపెట్టిన వారిని, నాపై కుళ్ళు వ్యక్తం చేసేవారిని, నామీద నిందలు, అభాండాలు వేసే వారితో నేను మరోమాట కూడా మాట్లాడను. 'వాళ్ళని అడగకపోయావు' అంటారు చాలామంది. కానీ అక్కడ బురద కనిపించినప్పుడు వెళ్ళి 'నువ్వు శుభ్రంగానే ఉన్నావు కదా ' అని పిచ్చి వాళ్ళు మాత్రమే అడుగుతారు" అన్నాడు.

"అందుకేనా, నేను పిన్నితో మాట్లాడితే ఏమనవు?" అడిగాను.

"తను నీతో బావుంటే మంచిదే కదా. నేనెందుకు అడ్డుపడతాను?" అన్నాడు.

ఈ సంభాషణతో తినేసరికి రుచి గ్రహించలేదు. ఇంతలో అన్నయ్యకి ఏదో ఫోన్ రావడంతో లోపలికి వెళ్ళి మాట్లాడాడు. నేను ఈ సంభాషణంతా జీర్ణించుకుని పుస్తకం చదవడం మొదలుపెట్టాను.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story